# నిరాశాపథంలో

శ్రీ డి. మహీంధర్ కుమార్

"సుశీ వదినా! ఎందుకలా వున్నావ్? మేఘాలతో ఆవృతమైవున్న ఆకాశంలో యేముందని, ఎల్లవేళలా ఏదో ఆలోచిస్తూ అటువేపు చూస్తుంటావ్? ఆలోచనలు మనసును చెడగొడతాయి. స్త్రీ యెక్కువగా ఆలోచించకూడదు. ఆలోచనలు యెక్కువైనకొద్దీ స్త్రీబుద్ధి చలిస్తుంది. ఆరోజువ నన్నూ, అన్నాయ్‌ను కూడా మరచిపోతావు—" అన్నది, అప్పుడే ఆ గదిలో ప్రవేశించిన సీత.

సుశీ క్షితిజంవేపుకు దృష్టినిగిడ్చి నీలి నిర్మల ఆకాశాన్ని వీక్షిస్తోంది. సీత మాటలు సుశీకి వినిపించలేదు. వెనుకటి రీతిగానే సుశీ మౌనముద్రలో నిమగ్నమైవుంది.

"వదినా! నీమౌనం నన్ను భయపెడుతోంది. అన్నాయ్‌కు రేపటితో క్యాంపు అయిపోతుంది. తప్పక రేపు తిరిగొస్తాడు. భర్తమీద భార్యకు అంత బెంగయితే యెలాగు? వివాహమయిన క్రొత్తలో స్త్రీ భర్తరాకకోసం నిమిషాలను లెక్కపెట్టుకుంటూ నిరీక్షిస్తుంది. ఆ నిరీక్షణలో ఆమె తన్నుతాను విస్మరించి, చివరకు బాహ్యప్రపంచాన్ని కూడా పూర్తిగా మరచిపోతుంది. అలాగే నీవు కూడాను. అవునుగదూ?" అని సీత నవ్వుతూ అడిగింది.

సుశీ వెనుకటి రీతిగానే ఆలోచనాముద్రలో వుంది. సీత చూస్తుండగనే అగస్మాత్తుగా సుశీ కళ్ళనుంచి అశ్రుబిందువులు రాలి క్రిందపడ్డాయి. కపోలాలమీద రెండుగీతలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

సీత కొంచెంగా భయపడింది. వేగిరపాటుతో సుశీని సమీపించింది. వదినె కన్నీరు కార్చడం సీతకిష్టంలేదు. భర్తదగ్గరకొచ్చిన స్త్రీ దుఃఖించకూడదు. వదినె హృదయవేదనానికి కారణం అన్నాయ్ కావచ్చు! వారానికి రెండురోజులుమాత్రం ఇంటిదగ్గరుంటాడు. తక్కినరోజుల్లో అన్నాయ్‌కు క్యాంపులతోనే సరిపోతుంది. ఇదే ఆమె నైరాశ్యానికి కారణమై వుండొచ్చు. అయినా సుశీ వదినె అంత మాత్రానికే కళ్ళవెంట నీరుకార్చటం సీతకేమీ బాగాలేదు. చదువుకున్న స్త్రీలు జీవితరంగంలో ఎదురయ్యే ఒడిదుడుకుల్ని అతి నేర్పుతో సరిజేసుకుంటారని సీత భావన. తన వదిన పరిస్థితిచూచి సీతకు ఆశ్చర్యంకూడా వేసింది.

తల చేత్తోపుచ్చుకొని సుశీ ఇంకా ఆలోచనా సముద్రంలోపడి కొట్టుకలాడుతూనే వుంది. ఒక్కసారిగా ఆమె తన జీవిత గ్రంథంలోని ప్రథమపుటల్ని సంస్మరించుకుంది......

"నేనూ—మధు కలిసి సాహిత్యక్షేత్రంలో నూతన జగత్తును నిర్మించాలని తీర్మానించుకున్నాం. ఇద్దరం ఒకటై నదిగా ప్రవహించాలనుకున్నాం. ఆఖరికి మా వివాహ నిర్ణయాన్ని మా తలిదండ్రులు ఆమోదించారు. కాని,.. నామనస్సులో నిర్మించుకున్న ఆశాభవనాలన్నీ ఒక్కుమ్మడిగా కూలి ముక్కలు ముక్కలయ్యాయి. నావూహాలు వూహాలుగానేవుండి—ఆకాశ కుసుమల్లాగా అంతర్హితమైపోయాయి. మధు అగస్మాత్తుగా చనిపోయాడు. అతనిచావు నా హృదయంలో మానని గాయంగా వుండిపోయింది.

మధు మరణానంతరంకూడా చంద్రం నన్ను కలుసుకునేందుకు వస్తూవుండేవాడు. మధు బ్రతికివున్నరోజుల్లో, అతనితోపాటు చంద్రంకూడావచ్చి

రచనా వ్యాసంగాలకు సంబంధించిన మా చర్చల్లో పాల్గొనేవాడు. చంద్రం మధుకు ఆంతరంగిక స్నేహితుడు. అంత పెద్దచదువు లేకపోయినా మధుకు సాంగత్యంవలన కొంత విజ్ఞానాన్ని ఆర్జించుకున్నాడు. చంద్రం కురూపి, నిర్ధనుడు, అనామకుడు. ఒక చిన్నయిల్లు ముసలితల్లి మినహా మరెవరూ లేరు చంద్రానికి.

రోజులు గడచినకొద్దీ చంద్రంమీద నాకదో రకమైన భావా లుదయింపసాగేయి. అతని చూపుల్లో, అతనిమాటల్లో,—మధు కన్పించేవాడు. ఆసమయంలో చంద్రాన్ని వివాహమాడాలనే భావం నాహృదయంలో తొంగిచూచేది. ప్రపంచ దృష్టిలో అతను కురూపి, నిర్ధనుడు, అనామకుడు. కాని, నా కతని హృదయసౌందర్యం స్పష్టంగా కన్పింపసాగింది. ఆభావం నాలో కలగగనే మధు లేని లోటు మరపుతెరల్లో యిమిడిపోయేది.

ఆరోజుకూడా నాలో ఏవేవో వూహలు రేగుతున్నాయి. చంద్రాన్ని వివాహం చేసుకోవాలనే భావం నాలోకలిగిన మరుక్షణాన నా హృదయం వణికిపోయింది. ఎవరో నా కంఠనాడులు నొక్కుతున్నట్లు తోచింది. నా వూపిరి ఆగిపోయింది. గుండె దడదడా కొట్టుకుంది. చెప్పలేనన్ని భావాలు కణతల్లో కొట్టుకోసాగేయి. ఆరోజునుంచే నేను ఆలోచించడం మానేశాను. నా ఆదర్శాలన్నీ నాముందే భగభగా మండి మసి అయిపోయాయి.

* * *

నేను కాదనలేకపోయాను. అలా అనగలిగే శక్తి నాలో నశించిపోయింది. మా తలిదండ్రుల అభీష్టప్రకారం వివాహం చేసుకునేందుకు నొప్పుకున్నాను. నేనా రోజు నాజీవితం ఏమవుతుందోనని ఆలోచించలేదు. గతాన్ని విస్మరించి భవితవ్యాన్ని సుమధురంగా నిర్మించుకోవాలనే ఆకాంక్షకొద్దీ పరిస్థితుల కనుగుణంగా వర్తించాను. దుఃఖంలో కృంగి కృశించిన హృదయాలకు భవితవ్యపు జీవితరంగంలో నిరాశాభావాలు తొంగి చూస్తాయనే భావంకూడా జనించదు. దుఃఖాలన్నిటికీకూడా చివరకు ఒకపరిమితి వుంటుంది. కాని వివాహమయ్యాక నాకు కలిగిన వ్యథ హద్దులు దాటింది.

నాభర్తను నేను సుఖపెట్టాలని యెంతో యత్నించాను. ఉరక వేస్తూ వేస్తూన్న కోరికల్ని నా భర్త అంతర్యంలో మిళితం చేయాలని ఎంతోయత్నించాను. నా సంస్కారాల ముద్ర నాభర్తమీద వేయాలనుకున్నా. కాని విఫలురాలనయ్యాను. నా వూహాప్రపంచం భగ్నమైపోయింది. ఉన్నత పదవిలోవున్న ఉద్యోగస్థుడంటే — నేను భ్రమపడ్డాను. నాహృదిలో లేచే భావాలకు రూపం కల్పించాలనుకున్నా. కాని నాభర్త—నామనసులో మనసుకలిపి —మమతపెంచి పూసలో దారంలాగా అనగిపెనగి కూడిమాడి వుండలేకపోయాడు. నాఆశాసౌధం నా ముందే భగభగా మండి నాశనమైపోయింది.

చంద్రం! అతని వున్నతమైన మనస్సూ, విచక్షణాపూరిత మేధస్సూ లోకం తెలుసుకోలేకపోయింది. అతని అంతర్యంలోని మార్దవం తెలుసుకోలేని మూర్ఖలోకం, అతనికి కురూపి, నిర్ధనుడు, అనామకుడని పేర్లు పెట్టింది.

గతాన్ని స్మరించుకుంటూన్న సుశీ హృదయఫలకంమీద చంద్రం మాటిమాటికీ కన్పించసాగేడు. ఆమె వుండలేకపోయింది, "కురూపి, నిర్ధనుడు, అనామకుడు—ఏం చేస్తున్నాడో!" ఈ మాటలు బిగ్గరగా పలికి అంతవరకు ఆలోచిస్తూ ఆకాశంవేపుకు చూస్తూన్న సుశీ క్రింద పడిపోయింది.

సీతకు భయమేసింది. సాయంత్రంనుంచి వదినె యిలాగే మాట్లాడకుండా ఆలోచిస్తోంది. ఆలోచనలు వదినె హృదయాన్ని చెడగొట్టాయి. అన్నాయ్‌ను వదినె కురూపి, నిర్ధనుడు, అనామకుడంటోంది. అన్నాయ్ ఎంతో అందమైనవాడు.

(తరువాయి 66 వ పేజీలో)

అప్పట్నుంచి నేను వారింట్లోనే వుండి మా అన్నయ్యతో కూడ కలిసి కాలేజీకి రావడమూ, జరుగుతోంది...లలితా ! నాజీవితంలో అమావాస్య గడ్డుదివసములు గడిచాయి. హృదయాకాశంలో చంద్రుడుదయించాడు. నాజీవితంలో యిది పున్నమ వెన్నెల." అని తన కథ ముగించింది అనూరాధ.

"ఆదే నాకు మొదట అర్థమవలేదు. నీవు అతనూ కలిసి రావడమూ చనువుగా మాట్లాడడమూ చూచి క్లాసులో గుసగుసలు బయల్దేరాయి. అందుచేత యిలా అడిగాను. అయినా చాల మంచిపనే జరిగింది. ఇంతవరకూ నీవు తల్లిదండ్రి, బంధువులు లేనిదానవని నాకు తెలీదు. లేకుంటే మాయింట్లోనయినా వుంచుకొనేదాన్ని." అని ఆశ్చర్యంతో లలిత అంటూండగా అనూరాధ ఆమె భుజంమీద ప్రేమతో తట్టి, యిద్దరూ క్లాసుకు వెళ్లారు; అప్పుడే బెల్లు (Bell) అవడంచేత.

---

## కృత్రిమపు వెన్నెల

బ్రిటన్‌లో రైల్వే కర్మాగారాలనుంచి చీకటి చాటున దొంగలు కొన్ని లక్షల పౌనుల విలువగల యంత్రవస్తు పరికరాలను అపహరిస్తూ వుండడంవల్ల 50 అడుగుల యెత్తు కొయ్యలకు మెర్క్యురి వేపర్ లాంపులనుఏర్పాటుచేసి చోరీలకు అవకాశంలేకుండా చెయ్యడానికి బ్రిటిష్ ప్రభుత్వాధికారులు యోచిస్తున్నారు. ఈ లాంపులవల్ల వ్యాపించేకాంతి అచ్చంగా వెన్నెలమాదిరిగానే వుంటుందట.

(60 వ పేజీ తరువాయి)

నెలకు రెండువందలు సంపాయిస్తున్నాడు. ఎంతో ప్రాపకంవుంది. వదినె యెందుకనాలి అవిధంగా? విరుద్ధ మనః ప్రవృత్తులుగలిగి పరస్పరంగా ఆకలింపు చేసుకోనంత కాలమూ, భార్యాభర్తల్లో ఎవరోఒకరు బాధపడుతూనే వుంటారు.

'వదినా! మాట్లాడవేం? అన్నాయ్ తప్పకుండా రేపటికి తిరిగొస్తాడులే వదినా!' అని పిలిచింది సీత.

సుశీ మాటా పలుకూ లేకుండా క్రిందపడిపోయింది. ఎలాగో సీత మంచంమీదికి చేర్చింది. ప్రక్కనకూచోని సపర్యలుచేస్తోంది.

నలువేపులా చీకట్లు క్రమ్ముకొచ్చాయి. ప్రక్కన కూర్చొని సీత రోదిస్తోంది. తీవ్రంగావున్న ఆజ్వరంలోనే సుశీ అప్పుడప్పుడు నిర్ధనుడు, కురూపి, అనామకుడని పలవరిస్తోంది. ఈమాటలు విన్నప్పుడల్లా సీత హృదయంలో కలకవేస్తోంది. రాత్రంతా ఆదేవిధంగా గడిచింది.

ఉదయమయేసరికి సుశీ జ్వరం తీవ్రరూపం దాల్చింది. సీత ప్రక్కనేవుంది. వణికిపోతూన్న శరీరంతో సుశీ ముఖంలో ముఖంపెట్టి చూచింది. ఆ చూపులు—'అన్నాయ్ అనామకుడని' చెబుతున్నట్లుగా తోచాయి.

ఆ చూపులతోనే సుశీ మృత్యుముఖంలోకి పయనమై వెళ్ళింది. అప్పుడే బయట కారు ఆగిన చప్పుడయింది. సీత 'వదినా!' అని కేకేసి క్రిందపడిపోయింది.

చక్కని కథలకు కథాంజలి చదవండి.

Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St. G. T. Madras.
Prnted by V. Kuppuswamy Chetty at Bharatamata press, 39, Anderson Street, G. T. Madras.